క్లుప్తంగా

మంత్రి ధర్మానను కలిసిన దువ్వాడ శ్రీనివాస్



మంత్రి ధర్మానను సత్కరిస్తున్న దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ మంగళవారం శ్రీకాకుళంలోని తన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల దువ్వాడను టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రకటించిన నేపథ్యంలో మంత్రిని దువ్వాడ కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని దుశ్శాలువతో సత్కరించారు. ధర్మానను కలిసిన వారిలో దువ్వాడ శ్రీధర్, వైకుంఠరావు, పాణిగ్రహి, బమ్మిడి తులసీరావు, పినకాన వైకుంఠరావు, లక్ష్మీపతి, హేమాచలం ఉన్నారు.

చింతామణి అమ్మవారికి పూజలు



విజయను సత్కరిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు, శేఖర్ తదితరులు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం చింతామణి అమ్మవారిని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కవిటి గ్రామసర్పంచ్ పూడి లక్ష్మణరావు, పాండవ చంద్రశేఖర్ ఆమెకు చింతామణి చిత్రపటాన్ని అందించి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఆమె బొరివంక కాళీమాత ఆలయాన్ని, జగతి గ్రామదేవత మర్లపోలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆమెతో పాటు సర్పంచ్‌లు బెందాళం శ్రీరాంప్రసాద్, పూడి వరప్రసాద్ ఉన్నారు.

తిరుపతిరావుకు గణిత మిత్ర అవార్డు



తిరుపతిరావుకు అవార్డు అందజేస్తున్న గణపతి

సోంపేట: మండలంలోని జాగృతి స్వచ్ఛంద సంస్థ 15వ వార్షికోత్సవం సందర్భంగా గణిత అవధాని మద్దు తిరుపతిరావుకు గణిత మిత్ర అవార్డుతో సంఘ ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. జాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో గణిత ప్రతిభను మెరుగు పరిచేందుకు కృషిచేయడంతో పాటు, వెయ్యి సంవత్సరాల కేలండర్ తయారు చేసి ప్రతిభను చాటిన దశావధాని తిరుపతిరావుకు అవార్డు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. గణితంలో మరిన్ని ప్రక్రియలకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

గిరిజనులకు వస్త్రాల పంపిణీ



లొద్దబద్రలో వస్త్రాలు పంపిణీ చేస్తున్న చిన్నాచారి, గ్రీన్‌ఆర్మీ సభ్యులు

కాశీబుగ్గ: లొద్దబద్ర గ్రామానికి చెందిన కొత్తపల్లి చిన్నాచారి నిరుపేద గిరిజనులు 260 మందికి సంక్రాంతి సందర్భంగా వస్త్రాలు, నిత్యవసర సరుకులు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. సంక్రాంతి సందర్భంగా గత 23 సంవత్సరాలు సేవా కార్యక్రమాలు చేయడం ఆనవాయితీ. సవర గోవిందపురం, కోఠారింగుతాళ్ల బద్ర, గట్టుమీదూరు, బాపనోడుపేట, దానగోర, సిరిపురం తదితర గ్రామాలకు చెందిన గిరి కుటుంబాలు సాయాన్ని పొందాయి. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాలరావు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కంచమ్మతల్లికి పూజలు



పూజలందుకున్న కంచమ్మతల్లి అమ్మవారు

కంచిలి: సంక్రాంతి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమ, మంగళవారాల్లో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కంచమ్మతల్లి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

సంతోషాల సంక్రాంతి

పెద్ద పండుగ.. జనానికి పేద్ద సంతోషాన్ని మిగిల్చింది. ఆదివారం భోగిని ఆనందంగా జరుపుకోగా.. సోమవారం సంక్రాంతిని, మంగళవారం కనుమను అంతకుమించిన ఉత్సాహంగా చేసుకున్నారు. నూతన వస్త్రాలను సమర్పించి పెద్దలకు మొక్కులు చెల్లించుకున్నారు. సంహపక్తి భోజనాలతో సంప్రదాయాన్ని కొనసాగించారు. రంగవల్లికలతో వీధులన్నీ కొత్త రూపాన్ని సంతరించుకున్నాయి. బతుకుతెరువు కోసం దూరప్రాంతాల్లో ఉంటున్నవారు పండుగ పుణ్యమాని స్వగ్రామాలకు రావడంతో కళకళలాడాయి. గంగిరెద్దుల ఆటలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలతో ఊళ్లన్నీ కొత్తశోభను సంతరించుకున్నాయి. చాలా మంది తమ కుటుంబీకుల జ్ఞాపకార్థం వస్త్ర, అన్నదానాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కనుమ సందర్భంగా చికెన్, మటన్ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అలాగే రైతులు తమ పశువులను చెరువుల్లో శుభ్రం చేసి వాటిని రంగులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు, యువతీ యువకులు కొత్త దుస్తులను ధరించి.. గాలిపటాలు ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు.



కవిటి: జగతిలో పశువుల్ని పూజిస్తున్న రైతులు, మహిళలు



టెక్కలి: టెక్కలిలో నిర్వహించిన ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్, సర్పంచ్ సుజాత తదితరులు



కవిటి: పొందూరుపుట్టుగలో సహపంక్తి భోజనాలు చేస్తున్న పొందూరు కుటుంబీకులు



టెక్కలి కిటకిటలాడుతున్న మాంసం దుకాణాలు



కాశీబుగ్గ: లొత్తూరులో జీవాలకు చెవులుకోస్తున్న కాపరులు



టెక్కలి: గాలి పటాలు ఎగురవేస్తున్న చిన్నారులు



ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడులో సంక్రాంతి వేడుకల్లో యువతీయువకులు



ఇచ్ఛాపురం రూరల్: కనుమ రోజు డూడూ బసవన్నల సందడి



నందిగాం: చిన్నలవునిపల్లిలో ముగ్గుల పోటీ నిర్వహిస్తున్న యువకులు



సోంపేట పొందర వీధిలో సంక్రాంతి సంబరాలు



మందసలోని రాజగోపాలస్వామి దేవాలయంలో గోవులకు సామూహిక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం రూరల్: బొడ్డఖాళీలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చల్లా కృష్ణారెడ్డి దంపతులు



ఇచ్ఛాపురం: జగన్నాథస్వామి ఆలయంలో గోమాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న స్థానికులు



కోటబొమ్మాళి: జగన్నాథపురంలో పోటీల్లో భాగంగా వేసిన ముగ్గులు



కాశీబుగ్గ: పురుషోత్తపురంలో క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న నాయకురాలు బద్రి సీతమ్మ



ఇచ్ఛాపురం రూరల్: నృత్యం చేస్తున్న యువతులు



వజ్రపుకొత్తూరు రూరల్: పల్లిసారథిలో గోపూజ చేస్తున్న ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, పార్టీ నాయకులు ఉదయ్‌కుమార్



వజ్రపుకొత్తూరు: కొమనల్తాడలో ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం



వజ్రపుకొత్తూరు రూరల్: సందడి చేస్తున్న గుణుపల్లి గ్రామస్తులు



కాశీబుగ్గ: చినంచలలో దుస్తులు వితరణ చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి దుర్యోధన

పూర్వ విద్యార్థుల ఔదార్యం



పాఠశాల అభివృద్ధికి కరపత్రాలు విడుదల చేస్తున్న పూర్వ విద్యార్థులు

మందస: మంజూష సంస్థానాన్ని పరిపాలించే రాజు శ్రీనివాసమహారాజు హయాంలో నిర్మించిన శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈ ప్రాంతానికే ఐకానిక్. 130 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కొన్ని పునర్మించబడగా.. నాడు–నేడు పథకంలో మరిన్ని భవనాలు బాగుపడ్డాయి. కానీ, పూర్వ వైభవాన్ని చాటి చెప్పే పాఠశాల ముందు భాగంగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పాఠశాలలో చదువుతున్న పూర్వ విద్యార్థులు బాగు చేయడానికి ముందుకు వచ్చారు. సంక్రాంతి పండుగ వేళ పూర్వ విద్యార్థులు చదువుకున్న పాఠశాలను పరిశీలించారు. పునః నిర్మించడానికి నిధులు సేకరించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. మందస హైస్కూల్ ఓల్డ్ బిల్డింగ్ రెనోవేషన్ ఫోరమ్ పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. పాఠశాలలో విద్యనభ్యసించిన వేలాది మందిని సభ్యులుగా చేర్చుతూ.. సమస్యను వివరిస్తున్నారు. కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. కాగా ఉపాధ్యాయుడు కర్రి పాపారావు లక్ష రూపాయలు, ఉపాధ్యాయుడు శిస్టు సోమనాథ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు శానాపతి కిశోర్‌కుమార్, వ్యాపారవేత్త ఇప్పిలి కేశవరావు(చిట్టి), ఉపాధ్యాయుడు ప్రభాకర్ పట్నాయక్ పదేసివేల రూపాయల చొప్పున, జల్లు కాశిబాబు రూ.25 వేలు ఇప్పటికే అందజేశారు. ఎన్నో ఏళ్లనాటి విద్యాలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అమెరికాలో ఉంటున్న ప్రొఫెసర్ మోహనరావు ఆచారి అన్నారు. పాఠశాలకు పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

- బీఆర్‌ఏయూ పూర్వ వీసీ లజపతిరాయ్



గోవుకు పూజలు చేస్తున్న లజపతిరాయ్

వజ్రపుకొత్తూరు రూరల్: తరతరాలుగా అచరిస్తున్న సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. కనుమ పండుగ సందర్భంగా నగరంపల్లిలో మంగళవారం గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి రైతులకు వస్త్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో అత్యంత దివ్య స్వరూపిణిగా అరాధించే గోమాతను మతాలకు అతీతంగా పూజించాలని కోరారు. వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ దువ్వాడ వెంకటకుమార్ చౌదరి, మాజీ సర్పంచ్ దువ్వాడ లక్ష్మి, నాయకులు జయరాం చౌదరి, అప్పారావు, చక్రవర్తి, డి.ఉమామహేశ్వరరావు ఉన్నారు.

బీసీల పక్షపాతి సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



నారాయణమ్మ, పుష్పను సత్కరిస్తున్న తిలక్

ఇచ్ఛాపురం రూరల్: బీసీల పక్షపాతిగా అందరి మదిలో చిరస్థాయిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోయారని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. ఇచ్ఛాపురం జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఎంపీపీ బోర పుష్పను మంగళవారం ఈదుపురంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం జగన్ జిల్లాలో బీసీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. వైస్ ఎంపీపీలు దువ్వు వివేకానందరెడ్డి, పూడి నేతాజీ, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెట్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి ఉన్నారు.

కౌన్సిలర్ ఔదార్యం



సింహాద్రికి సాయం అందజేస్తున్న ప్రదీప్

ఇచ్ఛాపురం: బెల్లుపడ కాలనీకి చెందిన బచ్చల సింహాద్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న 23వ వార్డు కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్ వైద్యఖర్చుల నిమిత్తం సింహాద్రికు రూ. 5వేలు ఆర్థిక సాయం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని ప్రదీప్ భరోసా ఇచ్చారు. వార్డు పెద్ద దిలీప్ పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక త్రినాథస్వామి వ్రతాలు



పూజలు చేస్తున్న దంపతులు

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధి బెల్లుపడ గ్రామంలోని శివానందగిరిపై కనుమ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం సామూహిక త్రినాథస్వామి వ్రతాలు వైభవంగా జరిగాయి. 54 జంటలు పాల్గొని పూజలు చేశాయి.

పీహెచ్‌డీ గ్రహీతకు సత్కారం



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు: రెయ్యిపాడు గ్రామానికి చెందిన కోనారి రాజశేఖర్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. డిజైన్ అండ్ ఎనాలసిస్ ఆఫ్ వేరిఎస్ ఆర్ మెమ్స్ స్విచ్ ఫర్ లోఫ్రీక్వెన్సీ అప్లికేషన్స్ అనే అంశంపై ప్రొఫెసర్ గిరిజ శ్రావణి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు కేఎల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ నేపథ్యంలో స్వగ్రామం రెయ్యిపాడు గ్రామస్తులు ఆయన్ని సోమవారం సత్కరించి గౌరవించారు. మాజీ ఎంపీపీ మద్దిల చిన్నయ్య, మాజీ సర్పంచ్ సైని భాస్కరరావు, కోనారి హరినాథ్, శ్రీనివాసరావు, ఎస్.షణ్ముఖరావు పాల్గొన్నారు.

సరిహద్దులు దాటిన దాతృత్వం



గిరిజనులకు కిట్లు అందజేస్తున్న గ్రీన్ ఆర్మీ సభ్యులు

మందస: సామాజిక, సేవా, దాతృత్వ కార్యక్రమాల్లో చురుకుగా ఉండే గ్రీన్ ఆర్మీ సభ్యులు ఓఏబీ (ఆంధ్రా–ఒడిశా బోర్డర్) గ్రామాలకు మంగళవారం వెళ్లి నిరుపేదలకు సాయమందించి ఆదర్శంగా నిలిచారు. అధ్యక్షుడు బోనెల గోపాల్ ఆధ్వర్యంలో మహేంద్రగిరుల్లోని రాయగడ బ్లాక్ కిరండి పంచాయతీ ఎలేసాయి, కొరటాసాయిలతో పాటు మందస, పలాస మండలాల్లో గల గిరిజన ప్రాంతాల్లోని నివశిస్తున్న పేద గిరిజనులకు చీరలు, దుప్పట్లు, లుంగీలు, టవళ్లు, పండ్లు, స్వీట్లు, బిస్కెట్లను 260 కుటుంబాలకు అందజేశారు. సంక్రాంతి వేడుకలను గిరిజనులతో గడుపుకోవడం ఆనందంగా ఉందని గ్రీన్ ఆర్మీ పేర్కొంది. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కొత్తపల్లి చిన్నచార్య, ట్రెజరర్ పేరాడ మన్మథరావు, ఉపాధ్యాయులు కిశోర్‌పాత్రో, కార్యదర్శి బి.తిరుమలరావు, గిరిజన సంఘం నాయకులు సవర ధర్మారావు, మంగుళలక్ష్మి, గున్ని ఉన్నారు.

నిర్మానుష్యంగా జంట పట్టణాలు



నిర్మానుష్యంగా ఉన్న కాశీబుగ్గ బస్టాండ్ ప్రాంతం

కాశీబుగ్గ: కొద్ది రోజులుగా జనంతో కిటకిటలాడిన పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలు మంగళవారం నిర్మానుష్యంగా మారాయి. సంక్రాంతి సందర్భంగా జనమంతా స్వగ్రామాలకు వెళ్లిపోవడంతో జనసంచారం లేక రోడ్లన్నీ బోసుపోయాయి. దుకాణాలు సైతం తెరచుకోలేదు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం

పొందూరు: మండలంలోని రాపాక గ్రామంలో వివేకానంద గ్రంథాలయ 7వ వార్షికోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 2023లో కొత్తగా ఉద్యోగాలు పొందిన వారికి, విద్యారంగంలో ప్రతిభను కనబర్చిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొంచాడ రమణమూర్తి, వండాన వెంకటరావు, కె.గిరిబాబు, పోతురాజు సూర్యారావు, బలగ శంకరభాస్కర్, వండాన అప్పన్న పాల్గొన్నారు.